

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | శుక్రవారం 30 అక్టోబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 39 | పేజీలు : 04, వెల రూ.2



'నేను అలా మాట్లాడాల్సింది కాదు'


- కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల కొండా సురేఖ వివరణ
- కేటీఆర్‌పై గతంలో చేసిన వ్యాఖ్యలపై కొండా సురేఖ తాజాగా వివరణ ఇచ్చారు
- ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టారు

హైదరాబాద్ :

కేటీఆర్‌పై గతంలో కొండా సురేఖ మంత్రి హోదాలో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల ఆమె వివరణ ఇచ్చారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టారు. కేటీఆర్‌పై - మిగతా 2 లో

మల్లన్నసాగర్ కూల్చాలని

కుట్ర చేస్తున్నారా



- వెంటనే బ్లాస్టింగ్ ఆపండి – బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు
- మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో బ్లాస్టింగ్‌లు చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు
- తక్షణమే బ్లాస్టింగ్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు
- మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలించిన హరీశ్‌రావు

హైదరాబాద్ :

మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్టకు సమీపంలో అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లు చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ - మిగతా 2 లో

నీటి వృథాపై ఫిర్యాదుకు 'పానీ' యాప్

- దుర్వినియోగం చేస్తే జరిమానాలు!
- "పానీ" పేరుతో ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించిన జలమండలి
- హైదరాబాద్‌లో నీటి దుర్వినియోగాన్ని అరికట్టేలా జలమండలి చర్యలు చేపట్టింది
- నగరపౌరుల్ని భాగస్వామ్యం చేస్తూ సరికొత్త ఉద్యమానికి జలమండలి శ్రీకారం చుట్టింది
- "పానీ" యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది



హైదరాబాద్ :

హైదరాబాద్ మహానగరంలో నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు జలమండలి సరికొత్త ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. నగర పౌరులను వాటర్ వారియర్స్‌గా ఆ ఉద్యమంలో భాగస్వాములను చేస్తూ ‘‘హూ కూచీ×’’ పేరుతో ప్రత్యేక యాప్‌ను విడుదల చేసింది. హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జలమండలి కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డితో కలిసి పానీ యాప్‌ను ఆవిష్కరించారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు తాగునీటి ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించేలా జలమండలి యాప్‌ను తీర్చిదిద్దింది. నీటిని వృథా చేసే వారిపై ఫిర్యాదు చేయడంతో పాటు వీడియోలు, ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా నేరుగా సంబంధిత యజమానికి తన నల్లా బిల్లులో జరిమానాలను విధించనుంది.నీటి - మిగతా 2 లో

తుపాను బాధితులకు

అండగా నిలవండి



- పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు
- ప్రభుత్వ సహాయక చర్యలు పూర్తిగా విఫలమయ్యాయని జగన్ విమర్శ
- టీడీపీ నేతలు బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణ
- సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని వ్యాఖ్య

అమరావతి :

అర్నబ్ తుపాను బాధిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలవాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సహాయక చర్యలు విఫలమయ్యాయని విమర్శించారు. అధికార పార్టీ నేతలు 'బియ్యం మాఫియా'ను ప్రోత్సహిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జిల్లా అధ్యక్షులు, రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... 'గ్రామ, వార్డు సచివాలయాల నిర్వీర్యం, వాలంటీర్ల వ్యవస్థ రద్దు ప్రభావం తుపాను సహాయక - మిగతా 2 లో


'అర్నబ్'తో ఆంధ్రప్రదేశ్‌కు రూ.4600 కోట్లకు పైగా నష్టం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- నేడు కేంద్ర బృందం పరిశీలన
- అర్నబ్ తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన పంటలను సీఎం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు
- ఉన్నతాధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు
- సీఎం చంద్రబాబు ఏరియల్ వ్యూ



అమరావతి :

అర్నబ్ తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయికి పర్యటనకు వెళ్లిన సీఎం, మార్గం మధ్యలో ఏరియల్ వ్యూ ద్వారా నష్టపోయిన పంటలను పరిశీలించారు. వరి చేలు, అరటి, కొబ్బరి తోటలు, ఆక్వా చెరువులను పరిశీలించారు. ఉన్నతాధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఏరియల్ వ్యూ ద్వారా కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ ప్రాంతాలను చూసిన సీఎం ఆ ప్రాంతాల్లో తుపాన్ ప్రభావం ఎంత మేర ఉందన్నది స్వయంగా వీక్షించారు. నిమ్మకూరు, పామర్రు, బంటుమిల్లిలో నీట మునిగిన పొలాలను చూశారు. నరసాపురం, పాలకొల్లు, అమలాపురంలో నీట మునిగిన పొలాలను విహంగ వీక్షణం చేశారు. కాట్రేనికోనలో నీట మునిగిన పొలాలను, కూలిన కొబ్బరి చెట్లు పరిశీలించారు. ఏయే ప్రాంతాల్లో ఎంత నష్టం జరిగిందనే అంశాలను సీఎంకు అధికారులు వివరించారు.అనంతరం కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరులో క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత సీఎం మీడియాతో మాట్లాడారు. "గత తుపానులను దృష్టిలో పెట్టుకుని పనిచేశాం, అర్నబ్ తుపానును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేశాం. అధికారుల అప్రమత్తతతో ప్రాణ నష్టం తగ్గింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. మారుమూల ప్రాంతాలకు వెళ్లాలన్నా ఎక్కడా అడ్డంకులు లేకుండా, రహదారులపై కూలిన చెట్లన్నీ తొలగించాం. టెలి కమ్యూనికేషన్‌లో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. సెల్ టవర్ల వద్ద టెలికాం సంస్థలు జనరేటర్లు ఏర్పాటు చేయకపోవడంతో సమస్యలొచ్చాయి. కోనసీమ, - మిగతా 2 లో



స్థానిక ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

- ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం
- రెండు రోజుల పాటు కొనసాగనున్న ఓటింగ్ ప్రక్రియ
- ఎన్నికల సిబ్బంది, దూర ప్రాంతాల ఓటర్ల కోసం ప్రత్యేక సౌకర్యం

అమరావతి :


ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఈరోజు ప్రారంభమైంది. ఈ ఓటింగ్ రెండు రోజుల పాటు కొనసాగనుంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందితో పాటు, దూర ప్రాంతాల్లో నివసించే అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఈ ఏర్పాటు చేశారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. - మిగతా 2 లో

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం

- అర్నబ్ తుపాను ప్రభావం నుంచి కోలుకోకముందే మరో ముప్పు
- దక్షిణ అండమాన్ సముద్రంలో కొత్త అల్పపీడనం
- రానున్న 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం
- నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రలో భారీ వర్షాలు
- కొత్త హెచ్చరికతో రైతులు, తీరప్రాంత ప్రజల్లో ఆందోళన

అమరావతి :

'అర్నబ్' తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం ఇంకా కోలుకోకముందే మరో ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి రాష్ట్రం వైపు కదిలే అవకాశం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం, - మిగతా 2 లో





కొండా సురేఖ బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందే

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- గతంలో కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్న కొండా సురేఖ
- వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటే సరిపోదన్న ప్రవీణ్ కుమార్
- టామ్‌కామ్ సంస్థను మంత్రి వివేక్ దుర్వినియోగం చేస్తున్నారని విమర్శ

హైదరాబాద్ :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై గతంలో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యల విషయంలో మాజీ మంత్రి కొండా సురేఖ షరతులు లేకుండా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సురేఖ తన వ్యాఖ్యలను కేవలం - మిగతా 2 లో

నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన

- వెనక్కి తగ్గేది లేదన్న ఖర్గే
- రామ్‌లీలా మైదానంలో భారీ కార్యక్రమం
- నిరసన వాయిదా ఉండదన్న మల్లికార్జున ఖర్గే
- ఎస్ఐఆర్‌లో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాల ఆరోపణ
- పండుగల సీజన్ దృష్ట్యా వాయిదా కోరిన వ్యాపార సంఘాలు
- ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యమన్న రాహుల్ గాంధీ





మార్చి నాటికి భారత్‌లో ఎండలతో

55 వేల మరణాల ముప్పు!

- ఎల్‌నినోపై కొత్త అంచనా!
- మార్చిలోనే ఎక్కువ మరణాలు సంభవించే అవకాశం ఉందని వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా 3.73 లక్షల మరణాల అంచనా
- నైజీరియాలో 56 వేల మరణాల ప్రమాదం ఉందన్న క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్
- ఎల్‌నినో ప్రభావం 2027 ప్రారంభం వరకు కొనసాగే అవకాశం

సంపాదకీయం

చైనా దూకుడు...!

భారత్--చైనా సరిహద్దులో పరిస్థితి సవ్యంగా లేదంటూ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు అధినేత చేసిన ప్రకటన ఆందోళన కలిగిస్తోంది. గత కొన్ని రోజుల్లో అరుణాచల్‌లోని వివిధ సరిహద్దు పోస్టుల్లో ఘర్షణలు జరిగాయి, అవి ఇంకా కొనసాగుతున్నాయి అన్నారాయన. తన దళాలను ఉద్దేశించి చేసిన ప్రసంగమే కానీ, దానిని ఐటీబీపీ ప్రత్యక్ష ప్రసారం చేయడంతో ఆ విషయం మీడియాకూ ప్రజలకూ చేరింది. బ్రిక్స్ సదస్సుకోసం చైనా అధ్యక్షుడు భారతదేశంలో ఉన్న సమయంలో కూడా ఈ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని ఆయన మాటలను బట్టి అర్థంచేసుకోవాలి. ఘర్షణలను ధ్రువీకరిస్తూ ఐటీబీపీ అధినేత వ్యాఖ్యానించడం కూడా ఇదే తొలిసారి. చైనాతో ఉన్న దాదాపు మూడున్నరవేల కిలోమీటర్ల సరిహద్దును గస్తీకాస్తున్న దళాల అధిపతినుంచి వచ్చిన ఈ ప్రకటన పరిస్థితి తీవ్రతను తెలియచెబుతోంది.ఘర్షణలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, ఆయా సందర్భాల్లో ఐటీబీపీకి చెందిన శౌర్య కమాండోలు అద్భుతంగా పనిచేస్తున్నారని, గల్వాన్ తరహా ఉదంతాలను ఎదుర్కోవడానికి మెరుగైన కార్యాచరణను సిద్ధం చేశామని ఐటీబీపీ డీజీ చెప్పుకొచ్చారు. అరుణాచల్‌లోని పలుప్రాంతాల్లో ఒక ప్రత్యేక కమాండో విభాగాన్ని, డ్రోన్‌ప్లాటూన్ల వంటివీ ఏర్పాటు చేయబోతున్నట్టుగా చెబుతూనే, చైనా ఆర్మీని ఢీకొనడానికి సంప్రదాయ యుద్ధపద్ధతులు సరిపోవనీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అధికంగా వినియోగించాలని అన్నారాయన. సహజంగానే ఈ ప్రకటనపై విపక్ష కాంగ్రెస్ స్పందిస్తూ, ఈ పరిణామాలేవీ ప్రజలకు తెలియనివ్వకుండా, దేశానికి సమాధానం చెప్పకుండా కేంద్రం మౌనం పాటిస్తోందని, మరోపక్క చైనాకు భారీ రాయితీలు కొనసాగిస్తోందని విమర్శించింది. గల్వాన్ ఘటన తరువాత చైనానుంచి దిగుమతులు 102శాతం పెరిగాయని ఆ పార్టీ విమర్శ. భారత విదేశాంగశాఖ అధికారప్రతినిధి ఈ పరిణామాలమీద అతిజాగ్రత్తగా ప్రతిస్పందించారు. నిర్దేశించిన గస్తీ పరిమితులను చైనా బలగాలు ఉల్లంఘించినప్పుడల్లా సరిహద్దువెంబడి ఘర్షణలు జరుగుతున్నాయని ఆ దేశంమీద ఓ విమర్శ చేశారు. అపోహలకు తావులేకుండా ఇరుదేశాలు దౌత్యాన్ని ఉపయోగించుకుంటూనే ఉన్నాయని అంటూ సరిహద్దుల్లో శాంతి, సామరస్యాలు నెలకొనడం ఉభయదేశాల ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు అత్యంత ముఖ్యమని గుర్తుచేశారు.ఆగస్టులో సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో అరుణాచల్‌లోని 27 ప్రదేశాలను వాటి ప్రామాణిక పేర్లతో భారతదేశం గుర్తించినప్పుడు ఇది కేవలం చైనాతో సాగుతున్న పేరుమార్పిడి యుద్ధంలో భాగమని అంతా అనుకున్నారు. అరుణాచల్‌లోని పలుప్రాంతాలకు చైనా తనసొంత పేర్లు పెడుతున్న నేపథ్యంలో, భారత అధికారిక పటంలో ఆ రాష్ట్రంలోని కీలకప్రాంతాలకు ఇలా నామకరణం చేసి, అరుణాచల్ మాదేనని విస్పష్టంగా చైనాకు చెప్పినందుకు జనం సంతోషించారు. మరీ ముఖ్యంగా ఇందులో అత్యంత సున్నితమైన, ఘర్షణలు రేగిన సరిహద్దు ప్రాంతాలు కూడా ఉన్నందున చైనా మ్యాప్‌వార్‌కు భారత్ గట్టి జవాబు ఇచ్చిందని భావించారు. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడుతున్న తరుణంలో ఇది పూర్తి విరుద్ధమైన చర్య అనీ, సరిహద్దు సమస్యలను సవ్యంగా పరిష్కరించుకోనివ్వకుండా ఇటువంటివి అడ్డుపడతాయంటూ చైనా ఈ చర్యను తప్పుబట్టింది కూడా. మరుసటి నెలలో చైనా అధ్యక్షుడు బ్రిక్స్ సదస్సుకోసం రాబోతున్న తరుణంలో భారత్ ఈ నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యం కూడా కలిగించింది. అయితే, అరుణాచల్ సరిహద్దుల్లోని పలుప్రదేశాల్లో జూలై నుంచే వివాదాలు రేగాయని, కొన్ని ప్రదేశాల్లో చైనా సైనికులు ఆరేడుకిలోమీటర్ల లోపలకు చొరబడి గుడారాలు వేశారని ఇప్పుడు అర్థమవుతోంది.2017లో డోక్లాం, 2020లో గాల్వాన్ తరహాలో అరుణాచల్‌లో మరో తీవ్ర ఘర్షణ ముంచుకొస్తోందా? అని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. చైనా ఆర్మీ అనేక విషయాల్లో మనకంటే పైచేయిలో ఉందని, సాంప్రదాయవిధానాల్లో దాని దూకుడును నియత్రించడం కష్టమన్న రీతిలో ఐటీబీపీ చీఫ్ చేసిన కొన్ని వ్యాఖ్యలను తప్పుబట్టినవారు, హద్దులు దాటారని విమర్శించినవారు లేకపోలేదు. అయితే, పాలకులకు తెలియకుండా ఆయన ఈ సరిహద్దు ఘర్షణలను బహిర్గతం చేశారనీ అనుకోలేం. చైనానుంచి మనం మళ్ళీ ఎదుర్కొంటున్న ప్రమాదాన్ని రిపైర్ కావడానికి కొద్దిరోజులముందు ఈ అధికారి బహిర్గతం చేయడం ఏ కారణాలతో జరిగినప్పటికీ అది మనం సంసిద్ధతకు ఉపకరిస్తుంది.

మార్చి నాటికి భారత్‌లో ఎండలతో 55 వేల మరణాల ముప్పు!



మొదటిపేజీ తరువాయి - భారత్‌కు ఎల్‌నినో రూపంలో మరో వాతావరణ ముప్పు పొంచి ఉందా? రాబోయే నెలల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రాణనష్టాన్ని పెంచే ప్రమాదం ఉందని తాజా పరిశోధన ఆధారిత అంచనాలు హెచ్చరిస్తున్నాయి. అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' రూపొందించిన కొత్త ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉంది. వీటిలో ఎక్కువ భాగం మార్చిలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా.ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో వేడికి సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఇది కచ్చితంగా చెప్పడం లేదు.ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా. కొత్త ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ట్రాకర్ పేర్కొంది.అయితే ఈ అంచనాలు మరణాలు తప్పనిసరిగా జరుగుతాయని చెప్పడం లేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన



మొదటిపేజీ తరువాయి - ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం చేపడుతున్న 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై కూడా ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ, ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు తమకు మద్దతుగా ఉన్నాయని వెల్లడించారు.పండుగల సీజన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తే ఢిల్లీలో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటాయని పలు వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ర్యాలీని మరో తేదీకి మార్చాలని రాహుల్ గాంధీని కోరాయి. పెద్ద ఎత్తున జనసమీకరణ వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతినడంతో పాటు తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని వ్యాపారులు పేర్కొన్నారు. అయితే ఈ విజ్ఞప్తుల నేపథ్యంలోనూ నవంబర్ 1న నిరసన కొనసాగుతుందని ఖర్గే స్పష్టం చేశారు.మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా నిరసనలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మార్చ్ ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఓట్ల చోరీని అడ్డుకోవడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమని అన్నారు. రాజకీయ భేదాలకు అతీతంగా విద్యార్థి సంఘాలు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాస్వామ్య స్వేచ్ఛలు, వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కులు ముప్పును ఎదుర్కొంటున్నాయని ఆయన ఆరోపించారు.నవంబర్ 1న దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఢిల్లీకి తరలివచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అంతకుముందు రోజు, అంటే అక్టోబర్ 30న, 'మాక్ పార్లమెంట్' నిర్వహించనున్నట్లు ఖర్గే వెల్లడించారు.

కొండా సురేఖ బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందే

మొదటిపేజీ తరువాయి - వెనక్కి తీసుకుంటే సరిపోదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కేటీఆర్‌పై తన వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకమైనవి కావని, వాటిని వెనక్కి తీసుకుంటున్నానని కొండా సురేఖ తాజాగా చేసిన ప్రకటనపై ప్రవీణ్ కుమార్ స్పందించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అలాంటి వ్యాఖ్యలు చేయడం నేరమని, ఆమె మాటలు తెలంగాణ మహిళల, రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీశాయని ఆరోపించారు. కేటీఆర్ పెద్ద మనసుతో కోర్టుకు వెళ్లారని, వాస్తవానికి ఆమెపై క్రిమినల్ కేసు పెట్టాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో హరీశ్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లకు కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు.ఇదే సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామిపై ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) సంస్థను మంత్రి వివేక్ దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. జర్మనీలో ఉద్యోగాల పేరుతో ప్రకటనలు ఇచ్చి, ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 4.10 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు.ఉచితంగా ఇవ్వాల్సిన అవకాశాలకు డబ్బులు వసూలు చేయడమే కాకుండా, టామ్‌కామ్ పేరుతో కాకుండా 'ఫెయిర్ ట్రీట్' అనే ప్రైవేట్ సంస్థ పేరుతో ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. 200 మంది నుంచి డబ్బులు వసూలు చేసి, 10 మందిని కూడా జర్మనీకి పంపలేదని అన్నారు. మెకాట్రానిక్స్ ఉద్యోగం అని చెప్పి పంపిన ఓ యువకుడికి అక్కడ కత్తి ఇచ్చి బీఫ్, మటన్ కోయమన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వివేక్ తన కుమారుడు గద్దం వంశీకృష్ణను ఇలాగే పంపిస్తారా? అని ప్రశ్నించారు.

మల్లన్నసాగర్ కూల్చాలని కుట్ర చేస్తున్నారా



మొదటిపేజీ తరువాయి - డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. పేలుళ్లతో కట్టకు ప్రకంపనలు వస్తున్నాయని, సమీపంలోని ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే బ్లాస్టింగ్‌లను నిలిపివేసి, కట్ట భద్రతపై అధికారులు సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిప్పారం గ్రామం వద్ద మల్లన్నసాగర్ కట్టను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు వంటేరు ప్రతాపరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు.పైప్‌లైన్ల పనుల కోసం జిలిటెన్ స్టిక్స్‌తో బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని, ఇందుకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అనుమతులు తీసుకోవాలని హరీశ్‌రావు అన్నారు. నిబంధనల ప్రకారం కట్టకు 400 మీటర్ల దూరంలో పేలుళ్లు జరపాల్సి ఉండగా, 200 మీటర్ల దూరంలోనే జరుగుతున్నాయని మండిపడ్డారు. రాత్రివేళల్లో బ్లాస్టింగ్‌లతో స్థానికులకు నిద్ర ఉండటం లేదని, ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని పేర్కొన్నారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. ఇళ్లకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధితులకు పరిహారం అందించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు."మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. మల్లన్నసాగర్ కూల్చాలని కుట్ర చేస్తున్నారా. మల్లన్నసాగర్ కట్ట పక్కనే అనధికారిక బ్లాస్టింగ్ చేస్తున్నారు. మేడిగడ్డను చేసినట్లు మల్లన్నసాగర్‌ను చేయాలని చేస్తున్నారాతక్షణమే బ్లాస్టింగ్ నిలిపివేయాలి. కట్ట భద్రతపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష చేయాలి".మల్లన్నసాగర్ భూసేకరణలో అసైన్డ్ భూముల రైతులకు తక్కువగా, పట్టా భూముల రైతులకు ఎక్కువగా పరిహారం ఇచ్చి అన్యాయం చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే సమీక్షించి న్యాయం చేయకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.తిప్పారం గ్రామం వద్ద పైప్‌లైన్ల పనుల కోసం జరుగుతున్న బ్లాస్టింగ్‌లతో ఇళ్లు దెబ్బతిన్నాయని, మల్లన్నసాగర్ కట్టకూ ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌తో కలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు దెబ్బతిన్నవారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

'అర్నబ్'తో ఆంధ్రప్రదేశ్‌కు రూ.4600 కోట్లకు పైగా నష్టం

మొదటిపేజీ తరువాయి - పశ్చిమగోదావరి జిల్లాల్లోనే ఎక్కువగా విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి" అని చంద్రబాబు తెలిపారు.రూ.4,600 కోట్లకు పైగా నష్టం : "ఇవాళ సాయంత్రానికి దాదాపు అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తాం. వెయ్యి మంది విద్యుత్ సిబ్బందిని పంపించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరాం. తెలంగాణ ప్రభుత్వం కూడా సాయం చేసేందుకు ముందుకొచ్చింది. అవసరమైతే తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాల సాయం కోరతాం. ఎల్లుండిలోగా ప్రతి ఇంటికీ విద్యుత్ సరఫరా చేసే బాధ్యత తీసుకుంటాం. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,600 కోట్లకు పైగా నష్టం జరిగింది. నష్ట పరిశీలనకు రేపు కేంద్ర బృందం వస్తుంది. అన్నివిధాలా అండగా ఉంటామని అమిత్‌షా భరోసా ఇచ్చారు" అని సీఎం తెలిపారు.అంతకుముందు వేట్లపాలెంలో అర్నబ్ తుపాను బాధిత రైతులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. దెబ్బతిన్న కొబ్బరి చెట్టుకు రూ.1500 చొప్పున సాయం అందిస్తామని తెలిపారు. పునరావాస శిబిరాల్లో ఉన్న బాధిత కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యం ఇచ్చి ఇళ్లకు పంపిస్తామని చెప్పారు. మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సీఎం పర్యటనలో పాల్గొన్నారు."ఎక్కడా ఒక్క చెరువు కూడా దెబ్బతినకుండా చేశాం. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,600 కోట్లకు పైగా నష్టం జరిగింది. నష్ట పరిశీలనకు రేపు కేంద్ర బృందం వస్తుంది. అన్ని విధాలా అండగా ఉంటామని అమిత్‌షా భరోసా ఇచ్చారు. పంటలకు బీమా చేయించి, రైతులకు నష్టం లేకుండా చేశాం. ప్రాణనష్టం చాలా వరకు తగ్గింది. తుపాను తీరం దాటుతున్న సమయంలో 35 వేల మంది గ్రామస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో ఉన్నా. తుపాను సమయంలో ప్రతిక్షణం అధికారులకు గైడ్ చేస్తూనే ఉన్నా. బాధితులకు నిత్యావసరాలు ఇస్తున్నాం.

తుపాను బాధితులకు అండగా నిలవండి

మొదటిపేజీ తరువాయి - చర్యలపై స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వం విపత్తులను ఆదాయ వనరుగా మార్చుకోవాల నుకుంటోంది' అని విమర్శించారు. సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వంలోని కీలక నేతలే బియ్యం ధరల పెరుగుదలకు కారణమని ఆరోపించారు. 'మంత్రి పయ్యావుల బియ్యంకుడు సహా టీడీపీ నేతలు బియ్యాన్ని మార్కెట్లోకి రానీయకుండా బ్లాక్ చేసి, ఎక్స్‌పోర్టు చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లోనూ బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారు' అని జగన్ వ్యాఖ్యానించారు.తుపాను కారణంగా వరి, ఆక్వా, పండ్ల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ క్లిష్ట సమయంలో బాధితులకు తోడుగా నిలవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ధాన్యం సేకరణలో రైతులకు అండగా ఉంటూ, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని జగన్ స్పష్టం చేశారు.

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం

మొదటిపేజీ తరువాయి - దక్షిణ అండమాన్ సముద్రం పరిసర ప్రాంతాల్లో ఒక అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. ఆ తర్వాత మరో 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.ఈ వాతావరణ వ్యవస్థ మరింత బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.ఇప్పటికే 'అర్నబ్' తుపాను కారణంగా పంట నష్టం, ఆస్తి నష్టంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కోస్తా జిల్లాల ప్రజలను ఈ కొత్త హెచ్చరిక మరింత ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో దీని తీవ్రత, కదలికలపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం



మొదటిపేజీ తరువాయి - ఈ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా జరిపేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి వార్డుకు ఒక రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ), ఇద్దరు సహాయకులను నియమించారు.నిబంధనల ప్రకారం ఓటింగ్ నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందిని క్షేత్రస్థాయిలో మోహరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోస్టల్ ఓటింగ్ పూర్తయిన వెంటనే, బ్యాలెట్ బాక్సులను పటిష్ఠ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు ఎన్నికల అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

'నేను అలా మాట్లాడాల్సింది కాదు'



మొదటిపేజీ తరువాయి - ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదని, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. నాడు కొన్ని నిరాధార వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందన్న సురేఖ, కేటీఆర్ ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే దురుద్దేశం తనకు లేదన్నారు. తన వ్యాఖ్యలు కేటీఆర్, ఆయన కుటుంబసభ్యులను నొప్పించి ఉంటే చింతిస్తున్నానని తెలిపారు. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పారు."బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై గతంలో నేను చేసిన కొన్ని వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల వివరణ ఇవ్వాలని అనుకుంటున్నాను. అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ విధంగా మాట్లాడానే తప్ప ఉద్దేశపూర్వకంగా కాదు. ఆనాడు నేను చేసిన కొన్ని నిరాధారమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సింది. కేటీఆర్ లేదా ఆయన కుటుంబ సభ్యులను బాధపెట్టాలని గానీ, వారి ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే దురుద్దేశం గానీ నాకు ఎంతమాత్రం లేవు. నా వ్యాఖ్యలు వారిని గానీ, వారి కుటుంబ సభ్యులను గానీ నొప్పించి ఉంటే అందుకు చింతిస్తూ, ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నాను.మంత్రి కొండా సురేఖ 2024 అక్టోబర్‌లో కేటీఆర్‌పై పలు వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో కేటీఆర్ అనేక మంది సినిమా హీరోయిన్ల జీవితాలతో ఆడుకున్నారని, సమంత-నాగ చైతన్య విడిపోడానికి కారణం కేటీఆరేనని సంచలన ఆరోపణలు చేశారు. కేటీఆర్ గతంలో ఫోన్ ట్యాపింగ్ ద్వారా అందరినీ ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిపారు. కేటీఆర్ వల్లే కొంతమంది హీరోయిన్స్ తొందరగా పెళ్లిళ్లు చేసుకుని సినిమాలు విడిచి వెళ్లిపోయారని ఆరోపించారు. కేటీఆర్ మత్తు పదార్థాలకు అలవాటు పడి, వారిని కూడా అందులోకి దించి రేవ్ పార్టీలు పెట్టారని విమర్శించారు. బ్లాక్ మెయిల్ చేసి అన్యాయంగా వాళ్ల జీవితాలతో ఆడుకున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా వివరణ ఇస్తూ ట్వీట్ చేశారు.ఈ విషయంలో అప్పుడే స్పందించిన కేటీఆర్ కొండా సురేఖకు తన న్యాయవాదుల ద్వారా లీగల్ నోటీసులు పంపించారు. తన గౌరవానికి, ప్రతిష్ఠకు భంగం కలిగించారని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం తన పేరును ఇష్టారీతిన వాడుకుంటున్నారని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఒక మహిళా మంత్రిగా ఉండి సాటి మహిళల పేర్లను వాడుకొని వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ ఘటన అనంతరం 24 గంటల్లోగా తనకు క్షమాపణ చెప్పకపోతే పరువు నష్టం దావాను వేయడంతో పాటు క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడా వెనకాడనని స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన కేసు ఇప్పటికీ కోర్టు విచారణ పరిధిలోనే ఉంది.కేటీఆర్‌పై కొండా సురేఖ వ్యాఖ్యల విషయంలో చాలా పరిణామాలే చోటు చేసుకున్నాయి. కొద్ది రోజుల తర్వాత సురేఖ సమంతకు క్షమాప ణలు కూడా చెప్పారు. తన వ్యాఖ్యల సారాంశం మహిళల పట్ల ఒక నాయకుడి చిన్నచూపు ధోరణిని ప్రశ్నించడమే కానీ, ఆ మహిళ మనోభావాలను దెబ్బతీయడం కాదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తన వ్యాఖ్యల వల్ల సమంత, ఆమె అభిమానులు మనస్తాపానికి గురైతే తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుం టున్నట్లు వివరణ ఇచ్చారు. ఈ వివాదంలో మంత్రిగా ఉన్న సురేఖపై విమర్శలు వెల్లు వెత్తాయి. నాగార్జున కుంటుంబం కూడా ఈ వివాదంపై కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.సరైన ఆధారాలు లేకుండా బాధ్యతా యుత మైన మంత్రి పదవిలో ఉండి సురేఖ మాట్లాడటంతో తెలంగాణ రాజకీ యాల్లో ఆ సందర్భంలో తీవ్ర ప్రకంపనలు చెలరే గాయి. ఇలా మాట్లాడటంతో క్రిమినల్ ప్రొసీడింగ్స్ తీవ్రరూపం దాల్చి న్యాయప రంగా కోర్టులో చిక్కులు కనిపిస్తుం డటంతో అక్కడ రక్షణ పొందేం దుకే సురేఖ ఇప్పుడు పశ్చాతాపం వ్యక్తం చేస్తున్నారని రాజకీ యాల్లో టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు ఈ వివరణ అధికార కాంగ్రెస్ పార్టీకి కూడా చిక్కులు తెచ్చి పెడుతు

వైసీపీ గెలుస్తుందని ఆ నాయకులు పగటి కలలు కంటున్నారు





- వంకర టింకర రోడ్లు, తండ్రి విగ్రహం తప్ప అనంత చేసిందేంటి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ఘాటు విమర్శలు
- 13, 12, 8, 2వ డివిజన్లలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మేయర్ అభ్యర్థి అజేష్ బాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ తో కలిసి ప్రచారం ఎన్నికల ప్రచారం
- ప్రజల నుంచి ఎమ్మెల్యే దగ్గుపాటికి అనూహ్య స్పందన
- ఎయిర్ పోర్ట్, ఓఆర్ఆర్, రైల్వేజంక్షన్ వస్తుందన్న దగ్గుపాటి

అనంతపురం, అక్టోబర్ 29, దరువు న్యూస్ :

మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ గెలుస్తుందని మాజీ ఎమ్మెల్యే అనతం వెంకట్రామిరెడ్డి పగటి కలలు కంటున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, మేయర్ అభ్యర్థి అజేష్ బాబు, కూటమి పార్టీల నాయకులతో కలిసి ఆయన ఇవాళ నగరంలోని 13, 12, 8, 2వ డివిజన్లలో ఆయన ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా డివిజన్ల అభ్యర్థులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించగా ప్రజల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. ఎక్కడక్కడ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల కూటమి పాలనలో నగరంలో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ దీపాలు వంటి మౌళిక వసతులకే 300కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. 15-20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎన్నో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించామని స్పష్టం చేశారు. నగరంలో కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేశామని, ఇంకా మిగిలి ఉన్న పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో నగరంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదని విమర్శలు చేశారు. గతంలో జగన్ రెడ్డి హయాంలో స్థానిక ఎన్నికల సమయంలో ఓటర్లను కనీసం బూత్‌లలోకి రానివ్వకుండా, నామినేషన్లు వేయనివ్వకుండా 80-85 శాతం స్థానాలను దౌర్జన్యంగా ఏకగ్రీవాలు చేసుకున్నారని మండిపడ్డారు. కానీ నేడు చంద్రబాబు నాయుడు నామినేషన్లు వేసేందుకు పోలీసు సెక్యూరిటీ ఇచ్చి ప్రజాస్వామ్యాన్ని కాపాడారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అల్లర్లు జరుగుతున్నవన్నీ వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్న చోట్లేనని, కూటమి నాయకులు ఎక్కడా గొడవలు చేయలేదన్నారు. ఈ గొడవలను బూచిగా చూపి స్థానిక ఎన్నికలను ఆపాలని వైసిపి కుట్ర చేస్తోందని, ఎన్నికలు ఆగిపోతే కేంద్ర నిధులు రావు, తద్వారా అభివృద్ధి ఆగిపోవాలన్నదే వారి ప్రధాన టార్గెట్ అని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మళ్లీ తామే గెలుస్తామని పగటి కలలు కంటున్నారని..గత సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇలాగే కలలు కన్నారని.. కానీ తాము 23 వేల ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించామని గుర్తుచేశారు. నాలుగు సార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా చేసిన వెంకటరామిరెడ్డి అనంతపురానికి ఏం చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఆయన చేసింది కేవలం వాళ్ల నాన్న విగ్రహం పెట్టుకోవడం మాత్రమేనని ఎద్దేవా చేశారు. జాతీయ రహదారి విస్తరణ కూడా గత టీడీపీ ప్రభుత్వంలోనే మంజూరైందని, వైసిపి హయాంలో ఎక్కడ డబ్బు ఇస్తే అక్కడ వంకర తిరుగుతూ వంకర టింకర రోడ్లు వేయించారని ఆరోపించారు. తాము గర్వంగా చెప్పుకునేలా నగరంలో 80 ఫీట్ రోడ్డు, రుద్రంపేట రోడ్లను వేయించామని, 30 ఏళ్ల నాటి కఠినమైన డంపింగ్ యార్డ్ సమస్యను క్లియర్ చేస్తున్నామన్నారు. నడిమి వంక, మరువ వంకలకు సైడ్ వాల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అజేష్ బాబు మేయర్ కాబోతున్నారని, దాంతో ఢిల్లీ చూపు కచ్చితంగా అనంతపురం వైపు మళ్లుతుందన్నారు. రాబోయే రోజుల్లో నగరానికి ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు, రైల్వే జంక్షన్ వస్తాయని భరోసా ఇచ్చారు. అనంతపురం చెరువు కట్టను అద్భుతమైన ట్యాంక్ బండ్‌గా మారుస్తామని, నేషనల్ పార్కును మరింత అభివృద్ధి చేసి, డంపింగ్ యార్డు స్థానంలో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ మరియు పార్కు తీసుకొస్తామన్నారు. నగర సమగ్ర వికాసానికి కూటమి వద్ద స్పష్టమైన ప్రణాళిక ఉందని, మేయర్ అభ్యర్థితో పాటు 62 స్థానాల్లో ఘనవిజయం సాధించి 100శాతం స్ట్రైక్ రేట్‌తో ఫలితాలు సాధించబోతున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు.

46వ డివిజన్‌లో సైకిల్ స్పీడ్

ప్రచారంలో పాల్గొన్న మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కెఎం హర్షదుల్లా





అనంతపురం, అక్టోబర్ 29, దరువు న్యూస్ :

అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో గురువారం 46వ డివిజన్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కురుబ చిట్రా జానకమ్మ ప్రచారం స్పీడుగా జరుగుతోంది. ప్రచారానికి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కెఎం హర్షదుల్లా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ అభ్యర్థి జానకమ్మకు, బీజేపీ అభ్యర్థి అజేష్ యాదవ్‌కు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతపురం నగరాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. కావున ఈ ఎన్నికల్లో సైకిల్, కమలం గుర్తులకు ఓటెయ్యాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో కురుబ రాజా, హేమంత్, సుమతి, సుజాత, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణి శ్రీలక్ష్మీ ప్రచారానికి అనూహ్య స్పందన

3వ రోజు ప్రచారంలో దగ్గుపాటి శ్రీలక్ష్మీ జోరు 45, 48, 49, 50, 53, 51 డివిజన్లలో ఇంటింటికీ వెళ్లిన శ్రీలక్ష్మీ





మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పుట్టపర్తిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు

పుట్టపర్తి, దరువు న్యూస్: త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం పుట్టపర్తి పట్టణంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ మాణిక్యరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐలు యువరాజు, శ్రీనివాసులు, రాజశేఖర్‌తో పాటు సబ్ డివిజన్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల భద్రతలో భాగంగా డ్రోన్ కెమెరాలతోనూ పట్టణంలోని పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

అర్నాబ్ తుఫాను సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్ 22 బృందాలు

ఢిల్లీ, దరువు న్యూస్: ఒడిశా నుంచి 8 బృందాల తరలింపు.. 38 మందికి సురక్షిత ప్రాంతాలకు చేరవేత అర్నాబ్ తుఫాను ముప్పును ఎదుర్కొనేందుకు 10వ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ మొత్తం 22 బృందాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, యానాంలో మోహరించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 14, ఒడిశా నుంచి 4, ఢిల్లీ నుంచి 4 బృందాలు ఉన్నాయి. ఒడిశా, ఢిల్లీ నుంచి వచ్చిన 8 బృందాలను విమానాల ద్వారా తరలించారు. తుఫాను ప్రభావిత, లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన బృందాలు స్థానిక పరిస్థితులు, రవాణా మార్గాలను పరిశీలించి సహాయక చర్యలకు సంసిద్ధమయ్యాయి. ప్రజలకు తుఫాను భద్రత, ముందస్తు జాగ్రత్తలు, సురక్షిత ప్రాంతాలకు తరలింపు, అధికారులతో సహకారంపై అవగాహన కల్పించాయి. ఈ చర్యల్లో భాగంగా 38 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కమ్యూనికేషన్ వ్యవస్థల పునరుద్ధరణ, సహాయక చర్యలకు ఆటంకంగా ఉన్న అడ్డంకుల తొలగింపు వంటి పనులు చేపట్టారు. తుఫాను సమయంలో ప్రజల భద్రత, తరలింపు, సహాయక చర్యలకు అవసరమైన మార్గాలను అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి సాంబశివరెడ్డి విస్తృత ప్రచారం



కొత్తచెరువు, దరువు న్యూస్: కొత్తచెరువు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి సాంబశివరెడ్డి ముమ్మర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని తలమర్ల, మీర్జాపురం, బంగారు చెన్నేపల్లి గ్రామాల్లో ఆయన ఇంటింటికీ తిరుగుతూ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రచారంలో పాల్గొన్న సాంబశివరెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నగరంలోని 37, 36, 38, 39 డివిజన్లలో హోరెత్తిన ప్రచారం



అనంతపురం, అక్టోబర్ 29, దరువు న్యూస్ :

డంపింగ్ యార్డ్ రహిత అనంతపురంతోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తీసుకొచ్చి, వైసిపి నోరు మూయిస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నగరంలోని పలు డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు. 37,36, 38, 39 డివిజన్లలో ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 37వ డివిజన్ దాసరి చంద్రకళ, 36వ డివిజన్ మల్లీశ్వరి, 38 కురుబ నారాయణస్వామి, 39 జయప్పతో కలిసి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. కాలనీల్లో ప్రజల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. గత రెండున్నర ఏళ్ల కూటమి పాలనలో అనంతపురం నగరంలో 350 కోట్లతో రికార్డు స్థాయిలో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. నగర సమగ్ర వికాసానికి, డంపింగ్ యార్డ్ రహిత అనంతపురాన్ని చూపాలన్నా ఇక్కడ బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ బాబు గెలవడం చారిత్రాత్మక అవసరమని, ఆయన ఉంటేనే కేంద్రం నుండి నిధుల వరద వస్తుందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.10లక్షల కోట్ల మేర అసాధారణ అప్పులు చేసి రాష్ట్రాన్ని ముంచడం వల్లే నిధులు లేక నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కాలేదని.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆ ప్రాజెక్టును కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. పార్కులను కూడా భారీగా డెవలప్‌మెంట్ చేస్తామని భరోసా ఇచ్చారు. నాలుగు సార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచిన వైసిపి నేత అనంత వెంకటరామిరెడ్డి నగరానికి చేసింది ఏమీ లేదని, వంకర టింకర రోడ్లు వేయించి, తన తండ్రి విగ్రహం ఏర్పాటు చేసుకోవడం తప్ప ఆయన మార్క్ ప్రగతి శూన్యమని ఎద్దేవా చేశారు. వారికి అభివృద్ధిపై కనీస అవగాహన లేకనే తమపై అడ్డగోలు విమర్శలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై అరాచకాల ఆరోపణలు చేస్తున్న వైసిపి నేతలే గతంలో కంటి అద్దాల దుకాణాలకు, ఇళ్లకు సంబంధించి దౌర్జన్యంగా డబుల్ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని ఆరోపించారు. అనంత వెంకటరామిరెడ్డి ఇల్లు ఐటీఐ ప్రాంగణంలో ఉందని, దానిపై త్వరలోనే అధికారికంగా పూర్తి స్థాయి సర్వే నిర్వహిస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. అలాగే వెంకటరామిరెడ్డి గతంలో బీసీలను ఇబ్బంది పెట్టిన విషయాలను ప్రస్తావించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, సుమారు రూ.20లక్షల కోట్ల పెట్టుబడులతో భారీగా ఉద్యోగాల కల్పన జరగబోతోందన్నారు. పరిశ్రమలు కూడా వేగంగా వస్తున్నాయని, రాబోయే రెండేళ్లలో రాష్ట్ర ప్రగతి ఊహించని స్థాయిలో మారుతుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

పాఠశాలల సమీపంలోని 306 ప్రాంతాల్లో రోడ్డు భద్రతా చర్యలు

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి, దరువు న్యూస్: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ అధికారులకు సూచించారు. గురువారం పుట్టపర్తి కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశంలో రహదారి భద్రతా చర్యలపై సమీక్షించారు. పంచాయతీ రహదారులు ప్రధాన రహదారులు, జాతీయ రహదారులకు కలిసే ప్రాంతాల్లో అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల సమీపంలో 306 ప్రాంతాల్లో రోడ్ సైనేజీలు, స్పీడ్ బ్రేకర్లు, మార్కింగ్స్ వంటి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన ఈ-డార్ వివరాలను సంబంధిత శాఖలు సమన్వయంతో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. జాతీయ రహదారులపై ప్రతి 40 కిలోమీటర్లకు పెట్రోలింగ్ వాహనాలతో పర్యవేక్షణ చేపడుతున్నట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారి వివరించారు. పెట్రోలింగ్ వాహనాల వివరాలను నెలవారీగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక, కంకర తరలించే టిప్పర్లలోని సరుకును టార్పాలిన్‌తో కప్పి ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్, ఎస్పీ పేర్కొన్నారు.



ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో దోపిడీ పాలన

- ప్రజలు ముందుచూపుతో ఆలోచించి ఓటు వేయండి
- వైఎస్ఆర్సీపీని గెలిపిస్తే ప్రజలకు తోడుగా ఉంటాం
- అనంతపురం నగర అభివృద్ధి వైసీపీతోనే సాధ్యం
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి
- మేయర్ అభ్యర్థి రమేష్‌గౌడ్‌తో కలిసి 61, 62, 60, 58, 15, 08, 07 డివిజన్లలో ప్రచారం
- ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థన







అనంతపురం, అక్టోబర్ 29, దరువు న్యూస్ :

జిల్లా కేంద్రమైన అనంతపురం నగరంలో రెండున్నరేళ్లుగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో దోపిడీ పాలన సాగుతోందని వైఎస్ఆర్సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీని గెలిపిస్తే ప్రజలకు జవాబుదారీగా తోడుగా ఉంటామని స్పష్టం చేశారు. గురువారం వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్‌గౌడ్‌తో కలిసి నగరంలోని 61, 62, 60, 58, 15, 08, 07 డివిజన్లలో వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులు వాసంతి, బిందుప్రియ, సుజాత, భవాని, బండి భార్గవి, గిరికా కృష్ణవేణి, పాయల ఉదయ్ కుమార్ తరఫున ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కర పత్రాలు అందించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అనంతపురం ప్రజలు విజ్ఞతతో ముందుచూపుతో ఆలోచించి మేయర్ అభ్యర్థి రమేష్ తోపాటు వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 2019 నుంచి 2024 వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పరిపాలన ఎలా సాగిందో గుర్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు నగరాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లామన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అనంతపురంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అనుచరులు దోపిడీ చేస్తున్న వైనాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ప్రజలంతా కలిసికట్టుగా నగరాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైసీపీని గెలిపిస్తే దుర్మార్గుల నుంచి, దౌర్జన్యకారుల నుంచి ప్రజలను రక్షిస్తామన్నారు. కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపుతున్నారని ఎద్దేవా చేశారు. తమను గెలిపిస్తే నగర ప్రజలకు మౌలిక సదుపాయాలను మరింత చేరువ చేస్తామని అనంత భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక హామీల అమలులో వైఫల్యం చెందిందన్నారు. నగరంలో ఒక్క కొత్త పింఛన్ ఇవ్వకపోగా 1300 పింఛన్లను తొలగించినట్లు చెప్పారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛన్ అనేవి మోసపూరిత హామీలుగానే నిలిచిపోయాయని విమర్శించారు. బీసీ కులానికి చెందిన విద్యావంతుడైన రమేష్‌గౌడ్‌ను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టామని, ఆయనతో పాటు అన్ని డివిజన్లలో వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అనంతపురం నగరం అభివృద్ధికి సహకరించాలని కోరారు.


















నూతన వధూవరులను ఆశీర్వదించిన వైవీఆర్



పామిడి, అక్టోబర్ 29, దరువు న్యూస్ :

పామిడి పట్టణంలోని రెహమత్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు గుంతకల్లు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరై వధూవరులకు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి పట్టణ వైసీపీ నాయకులు శింగరప్ప, బాలకృష్ణలు ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకటరామి రెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితర నాయకులు వధూవరులను కలిసి, వారి కొత్త జీవితం సుఖశాంతులతో సాగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీ చెన్నకేశవ రెడ్డి, నాగేష్, రామచంద్ర, తుల్లా బాయ్, బాలకృష్ణ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుత్తా హరికి జాతీయ అవార్డు



అనంతపురం, అక్టోబర్ 29, దరువు న్యూస్ :

జిల్లాకు చెందిన కవి, రచయిత, జర్నలిస్టు, సామాజిక కార్యకర్త గుత్తా హరిసర్వోత్తమ నాయుడుకు జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు దక్కింది. విద్య, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవారంగాల్లో ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా నెల్లూరులో ఘనంగా సత్కరించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యవర్గసభ్యునిగా, డాక్టర్ నల్లాని రాజేశ్వరి ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షునిగా, జాతీయ ఉపాధ్యక్షులుగా ఆయన విశేష సేవలందిస్తున్నారు. ఎంవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ విజయకుమార్ ఆసుపత్రి సమావేశమందిరంలో పలువురు ప్రముఖులు గుత్తా హరికి అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు లీలా మోహనకృష్ణ, కార్యదర్శి విజయలక్ష్మి, సీనియర్ రచయితలు సాధనాల వెంకటస్వామి నాయుడు, డాక్టర్ సి.నారాయణ స్వామి, అరవ జయపాల్, వలిపి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. గుత్తా హరికి అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. తన సేవలను గుర్తించి ప్రోత్సహించడం పట్ల ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించండి

- బూత్ ఏజెంట్లను బైండోవర్ పేరుతో వేధించడం తగదు
- ఎస్పీని కలిసి వివరించిన వైసీపీ, సీపీఐ నేతలు

అనంతపురం, అక్టోబర్ 29, దరువు న్యూస్ :

అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్పీ జగదీష్‌ను కలిసి, ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, వైసీపీ మేయర్ అభ్యర్థి సి.రమేష్, సీపీఐ జాయింట్ సెక్రటరీ రాజారెడ్డి తెలిపారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, వైసీపీ నగర మేయర్ అభ్యర్థి రమేష్, సీపీఐ జాయింట్ సెక్రటరీ రాజారెడ్డితో కలిసి పార్టీ నాయకులు ఎస్పీని కలిశారు. గత పది రోజులుగా, ప్రత్యేకంగా ఓటింగ్ ముందు రోజుల్లో నగరంలో నెలకొన్న పరిస్థితులపై వారు ఎస్పీకి వివరించారు. వైసీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలపై పోలీసులు బైండోవర్లు విధిస్తున్నారని, ప్రముఖ నాయకులు, ఏజెంట్లు, అభ్యర్థులను కూడా లక్ష్యంగా చేస్తున్నారని ఆరోపించారు. కొందరికి ఫోన్ కాల్స్ ద్వారా బెదిరింపులు జరుగుతున్నాయని, ఇలాంటి చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపుతాయని వాదించారు. అలాగే చుట్టుపక్కల గ్రామాల నుంచి కొందరిని నగరానికి తీసుకువచ్చి బూత్ క్యాప్చరింగ్ చేయాలని కుట్ర జరుగుతోందని, ఇలాంటి చర్యలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియ ఇప్పటివరకు సాధారణంగా జరిగిందని, అనంతపురం ప్రజలు ప్రజాస్వామ్య విలువలను పాటిస్తున్నారని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ఎలాంటి తప్పు చేయకపోతే బైండోవర్లు ఏమీ పనికి రావని, ఎవరూ భయపడకూడదని అనంత వెంకట్రామిరెడ్డి తెలియజేశారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, వైసీపీ తరపున ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించేందుకు సంసిద్ధమని వారు తెలిపారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడం పోలీసు, జిల్లా అధికారుల బాధ్యత అని వైసీపీ నాయకులు అన్నారు. బెదిరింపులు, ఏకపక్ష చర్యలను నివారించి, అన్ని పార్టీలకూ సమాన అవకాశం కల్పించాలని ఎస్పీని కోరారు.



పాతూరు మార్కెట్‌లో వైసీపీ ఎన్నికల ప్రచారం

అనంతపురం, అక్టోబర్ 29, దరువు న్యూస్ :

అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాతూరు కూరగాయల మార్కెట్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ మేయర్ అభ్యర్థి చిట్లూరి రమేష్, 11వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి నసీమా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ అభ్యర్థులతో కలిసి ప్రజలను అభ్యర్థించారు. మార్కెట్‌లో వ్యాపారులు, స్థానిక ప్రజలతో మాట్లాడిన రమేష్, నగరంలో మౌలిక సదుపాయాలు, శానిటేషన్, రోడ్లు, నీటి సరఫరా వంటి అంశాలపై ప్రాధాన్యతతో పనిచేస్తామని అన్నారు. అనంతపురం నగర సమగ్ర అభివృద్ధికి వైఎస్సార్సీపీని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అభ్యర్థి నసీమా మాట్లాడుతూ.. 11వ డివిజన్ ప్రజల సమస్యలను దగ్గరగా గమనించి పరిష్కరిస్తానని, వారి అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక అవసరాలపై దృష్టి సారించి ప్రజలకు న్యాయమైన సేవలు అందించడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రచారంలో పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





రాఘవేంద్రుడిని దర్శించుకున్న..

వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్

- ప్రత్యేక పూజలు.. ఆశీర్వదించిన పండితులు



అనంతపురం, అక్టోబర్ 29, దరువు న్యూస్ :

నగరంలోని ఒకటవ రోడ్డులో ఉన్న రాఘవేంద్ర స్వామి మఠం ఆలయంలో వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్‌తో పాటు వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులు ఇషాక్, చంద్రమోహన్ రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి కలిసి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి అనుగ్రహం కోరుకున్నారు. అనంతరం మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా తనను, కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని భక్తులు, ఓటర్లను కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, నగరాభివృద్ధికి పార్టీ అంకితభావంతో పని చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ పూజారులు అభ్యర్థులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.